www.aryadvi.com
తెలుగు దినపత్రిక
News Daily
ఆర్యాద్వి
అక్షర సత్యం - ప్రజా సాక్ష్యం
గురువారం
22-10-2026
సంపుటి (VOLUME) : 1 సంచిక (ISSUE): 1
పేజీలు : 8
వెల : 1/-
Simultaneously Published from: Hyderabad | Vijayawada | Visakhapatnam




మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..



## హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు

పంతంగి వద్ద నెమ్మదిగా కదులుతున్న వాహనాలు

- దసరా సెలవులు ముగియడంతో పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీ రద్దీ
- హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలతో కిక్కిరిసిన టోల్‌గేట్
- స్కూళ్లు, కాలేజీలు తిరిగి ప్రారంభం కావడంతో ఒక్కసారిగా పెరిగిన రద్దీ
- 12 టోల్ బూతులు తెరిచి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న అధికారులు
- చిట్యాల, చౌటుప్పల్ వద్ద నిర్మాణ పనులు కూడా ట్రాఫిక్‌కు కారణంగా గుర్తింపు

- మిగతా 2లో

# తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు..
# 19 రోజుల్లోనే రూ.2,054 కోట్లు

- గత ఏడాదితో పోలిస్తే 37.02 శాతం వృద్ధి
- బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా పెరుగుదల
- 30.37 లక్షల కేసులకు చేరిన బీర్ల విక్రయాలు
- IMFL అమ్మకాలు 18.38 లక్షల కేసులకు పెరుగుదల
- అక్టోబర్ 19న రూ.303.40 కోట్ల విక్రయాలు



తెలంగాణలో దసరా పండుగ సీజన్‌లో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే విక్రయాలు 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడించాయి. పండుగ వేళ బీర్లకు డిమాండ్ గణనీయంగా పెరగడం ఈసారి ప్రత్యేకంగా కనిపించింది.ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ )తో పోలిస్తే బీర్ల విక్రయాలు

- మిగతా 2లో



## ఉద్ధవ్‌పై ఎన్డీయే ఎదురుదాడి..

'అధికార మార్పిడి' వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం

- అధికార మార్పిడి కోసమే వచ్చామన్న ఉద్ధవ్ థాకరే
- కాషాయం తమ గుర్తింపు అని, ఎవరూ దొంగిలించలేరని వ్యాఖ్య
- ఉద్ధవ్ వ్యాఖ్యలపై ఎన్డీయే కూటమి నేతల తీవ్ర స్పందన
- థాకరే హిందుత్వంపై ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని బీజేపీ, శివసేన ఆరోపణ
- ఈ వ్యాఖ్యలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని ఎన్డీయే స్పష్టం

- మిగతా 2లో

## 'నేనేం ట్రావెల్ ఏజెంట్‌ను కాదు'.. రాహుల్ పర్యటనపై శశిథరూర్

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై వస్తున్న వార్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ ఆసక్తికరంగా స్పందించారు. రాహుల్ పర్యటన

- మిగతా 2లో




## వేరే దేశానికి యురేనియం తరలించే ప్రసక్తే లేదు: ఇరాన్

పశ్చిమాసియాలో ఘర్షణలు ముగించేలా అమెరికా - ఇరాన్ మధ్య పాకిస్థాన్ రాయబారం కొనసాగిస్తూనే ఉంది. సంధిపై ముందుకెళ్లే

- మిగతా 2లో






## తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు

- బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్
- రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొనసాగుతుందని విశ్వాసం
- కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య

తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో

- మిగతా 2లో




- జంబూ సవారీలో బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న సీఎం
- కన్నడ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిన జానపద కళలు, సంగీతం, నృత్య ప్రదర్శనలు
- కర్ణాటక సీఎం ఆహ్వానం మేరకు ఉత్సవాలకు హాజరైన రేవంత్‌రెడ్డి
- చాముండేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ ముఖ్యమంత్రి
- కేరళ సీఎం వీడీ సతీశన్‌తో పాటు పలువురు ప్రముఖులతో కలిసి ఉత్సవాలను వీక్షించిన రేవంత్‌రెడ్డి

కర్ణాటకలో అత్యంత వైభవంగా నిర్వహించే మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. మైసూరు దసరా ఉత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఘట్టం.. జంబూ సవారీలో అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో

- మిగతా 2లో







## 1986 నుంచే నా దగ్గర రివాల్వర్ ఉంది

మాజీ మంత్రి మల్లారెడ్డి కామెంట్స్ వైరల్

:మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన రివాల్వర్ గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దసరా పండుగ ఆయుధ పూజలో పాల్గొన్న ఆయన.. రివాల్వర్ చూపిస్తూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. విజయదశమి సందర్భంగా హైదరాబాద్ బోయినపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తన రివాల్వర్‌కు పూజలు చేసిన అనంతరం

- మిగతా 2లో



## 2028లోపు పోలీసు ఖాళీలన్నీ భర్తీ

- ఈ శాఖలో యువ రక్తాన్ని నింపుతున్నాం
- ఆహార కల్తీకి పాల్పడే వారిపై ఉక్కుపాదం
- పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజలను కాపాడేందుకు ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులు అమరులైతే వారిలో తెలంగాణలో ఏఎస్సై దేవిసింగ్, కానిస్టేబుళ్లు ఎంపల్లి ప్రమోద్‌కుమార్, శీలం కమలాకర్, ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య విధి నిర్వహణలో

- మిగతా 2లో

## ఇండియా కూటమి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం

- ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందన్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్
- న్యాయవ్యవస్థ, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నారని ఆరోపణ
- అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు
- అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు సభలు, సమావేశాలు
- రాహుల్ గాంధీ అధికార దాహంతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శ

- మిగతా 2లో



## దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి

- హైదరాబాద్‌లో మూడు చోట్ల పోలీసుల దాడులు
- నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన సీపీ సజ్జనార్
- జీవకారుణ్యమే నిజమైన భక్తి అని ప్రజలకు పిలుపు
- వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి

- మిగతా 2లో



## 2028లోపు పోలీసు ఖాళీలన్నీ భర్తీ

- మొదటి పేజి తరువాయి

మరణించినట్టు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో వారి త్యాగాలను మరవలేమని, అమరుల కుటుంబం ఒంటరి కాదని స్పష్టం చేశారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాల వారితో మాట్లాడారు. కుటుంబసభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. 'అమరులు వారు' పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "పరిశ్రమలు, పర్యాటకం, రహదారులతోనే అభివృద్ధి సాధ్యం కాదు. శాంతిభద్రతలు సక్రమంగా ఉన్నప్పుడే ప్రజలు ధైర్యంగా ఉంటారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసు శాఖను బలోపేతం చేసేందుకు ఎన్నో చర్యలు చేపట్టింది.. 16 వేల మంది ఎస్సై, కానిస్టేబుళ్లను నియమించింది. పోలీసుశాఖలో మరో 5వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నాం. 2028లోపు విడతల వారీగా పోలీసుశాఖలో ఖాళీలన్నీ భర్తిచేస్తాం. కొత్త సిబ్బంది నియామకమే గాకుండా శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టిసారించాం.

**కొత్త నేరాలను ఎదుర్కొనేందుకు పోలీసు వ్యవస్థ సిద్ధంగా ఉండాలి**

ఇటీవలే 112 మంది డీఎస్పీలు శిక్షణ పూర్తిచేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇంత పెద్దఎత్తున డీఎస్పీల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జరగలేదు. యువరక్తాన్ని పోలీసుశాఖలో నింపే ప్రయత్నంలో భాగంగా ఈ నియామకం జరిగింది. కొత్త నేరాలను ఎదుర్కొనేందుకు పోలీసు వ్యవస్థ సిద్ధంగా ఉండాలి. విధినిర్వహణలో కానిస్టేబుళ్లు వీరమరణం పొందితే బాధిత కుటుంబానికి ఇచ్చే రూ.40 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.కోటికి పెంచాం. హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు రూ.45 లక్షల నుంచి రూ.కోటి; ఎస్సైలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షలుంటే రూ.1.25 కోట్లు; డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు రూ.50 లక్షలుంటే రూ.1.50 కోట్లకు పెంచాం. ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.కోటి పరిహారం ఉంటే దాన్ని రూ.2 కోట్లు చేశాం. ఇది కేవలం ఆర్థికసాయం కాదు.. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం. మంచిరేవుల వద్ద 44 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న యంగ్‌ఇండియా పోలీసు స్కూల్‌లో హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు వారి పిల్లలకు అవకాశం కల్పించాం. ట్రాఫిక్, శాంతిభద్రతల నిర్వహణలోని హోంగార్డుల రోజువారీ గౌరవ వేతనాన్ని రూ.1000కి పెంచాం. విధినిర్వహణలో హోంగార్డులు ప్రాణాలు కోల్పోతే బాధిత కుటుంబానికి ఇచ్చే రూ.5 లక్షల గ్రేషియాను, రూ.10 లక్షలకు పెంచాం" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. వారి కుటుంబాలకు వైద్యభద్రత కోసం చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు.

**బాధితులు, సామాన్యులకే ఫ్రెండ్లీ పోలీసింగ్**

కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు దీటుగా పోలీసులు.. సాంకేతికత, ఏఐ వినియోగంపై దృష్టిసారించాలని సీఎం ఆదేశించారు. "సైబర్, ఆర్థిక నేరాలు, మాదకద్రవ్యాల అక్రమరవాణాతో పాటు ఆహార కల్తీ తీవ్ర సమస్యగా మారింది. అది ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తోంది. ఆహార కల్తీకి పాల్పడే ఎవ్వరినీ వదిలిపెట్టం. వారిపై ఉక్కుపాదం మోపుతాం. సాంకేతికత ఎంత పెరిగినా పోలీసులు.. మానవతా దృక్పథాన్ని వీడకూడదు. మరో విషయమేమిటంటే పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులు, సామాన్యులకే ఫ్రెండ్లీ పోలీసింగ్ అని గుర్తుంచుకోండి. నేరస్థుల పట్ల కఠినంగానే ఉండాలి. యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ కట్టడికి ప్రాధాన్యం ఇస్తున్నాం. యువత వద్ద పుస్తకాలు, నైపుణ్యాలు, ఆలోచనలు ఉండాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డ్రగ్స్ నియంత్రణలో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నుంచి అభినందనలు అందుకున్న ఈగల్ బృందాన్ని, డీజీపీ ఆనంద్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. పౌరులు.. డ్రగ్స్ సరఫరా, వినియోగ సమాచారాన్ని 1908 హెల్ప్‌లైన్‌కు అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతకు ప్రత్యేకచర్యలు చేపట్టామన్నారు. పోలీసు అమరుల కుటుంబాలకు డీజీపీ సీవీ ఆనంద్ సానుభూతి తెలిపారు. "1997లో నేను నిజామాబాద్ ఎస్పీగా పనిచేసిన సమయంలో 126 మంది పోలీసులు అమరులయ్యారు. మందుపాతరలు,పోలీసు సిబ్బందిపై దాడులు, కాల్పుల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌లో ప్రస్తుతం 350 మంది విద్యార్థులు చదువుతున్నారు. మంచిరేవుల వద్ద శాశ్వత క్యాంపస్ ఏప్రిల్ నాటికి పూర్తయితే 720 మంది విద్యార్థులకు విద్య అందించే అవకాశం ఉంటుంది" అని వివరించారు. కార్యక్రమంలో ఈగల్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య, ఎస్పీఎఫ్ డీజీ స్వాతిలక్రా, శాంతిభద్రతల డీజీ మహేశ్ భగవత్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ పోలీసు ఉన్నతాధికారులు, విశ్రాంత ఐపీఎస్‌లు పాల్గొన్నారు.

## 'నేనేం ట్రావెల్ ఏజెంట్‌ను కాదు'.. రాహుల్ పర్యటనపై శశిథరూర్

- మొదటి పేజి తరువాయి

గురించి మీడియా ప్రశ్నించగా, "నేనేమీ ట్రావెల్ ఏజెంట్‌ను కాదు" అంటూ ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం.బుధవారం తిరువనంతపురం లో శశిథరూర్ విలేకరులతో మాట్లాడుతూ "నేను ట్రావెల్ ఏజెంట్‌ను కాదు. ఆ ప్రశ్న నన్ను అడగటంలో అర్థం లేదు. నేను ఢిల్లీ వదిలి ఇక్కడికి ఎందుకు వచ్చాను? ప్రతి వ్యక్తికి కొన్ని బాధ్యతలు ఉంటాయి. కాబట్టి, నేను ఆ విషయంపై వ్యాఖ్యానించలేను" అని స్పష్టం చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్)కు వ్యతిరేకంగా ఢిల్లీలో విపక్షాలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లడంపై బీజేపీ తీవ్ర విమర్శ లు గుప్పిస్తోంది. రాహుల్ వియత్నాం వెళ్తున్న విమానంలో ఉన్నారంటూ ఒక వీడియోను బీజేపీ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. నిరసనలతో బాగా అలసిపోయినందువల్లే ఆయనకు విశ్రాంతి అవసరమైందని బీజేపీ నేత షానవాజ్ హుస్సేన్ ఎద్దేవా చేశారు.అయితే, రాహుల్ గాంధీ పర్యటనను కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ సమర్థించారు. ప్రధాని సహా ఇతర నేతలు విదేశాలకు వెళ్లడం లేదా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని నిలదీశారు. విదేశాల్లో రాహుల్ విద్యార్థులతో, మేధావులతో సమావేశమవుతారని, ఇంటర్వ్యూలు ఇస్తారని ఆయన గుర్తుచేశారు.

# ఇండియా కూటమి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం

కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి కలిసి దేశవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తూ, నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా వారి చర్యలు ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ ప్రయోజనాల కంటే అధికారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు.నిరసనల ముసుగులో చట్టాలను ఉల్లంఘించడం, నిరాధార ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, అశాంతి సృష్టించేందుకు విదేశీ నిధులు కూడా వస్తున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందని, ఎలాంటి ఆధారాలు లేకుండా లక్షలాది మంది ఓటర్లను జాబితాలో చేర్చాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చేలా యాత్రలు నిర్వహించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు.

ఇండియా కూటమి అసత్య కథనాలను తిప్పికొట్టేందుకు బీజేపీ దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు లక్ష్మణ్ ప్రకటించారు. అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు, మేధావులు-విద్యావంతులతో చర్చాగోష్టులు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 మందితో సమావేశాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. దేశ భద్రత, అర్హులైన ఓటర్ల హక్కుల విషయంలో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోదని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణతో పాటు జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియ, ప్రతిపక్షాల నిరసనలపై రాజకీయ వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో లక్ష్మణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ, ఎన్నికల సమగ్రత గురించిన ఆందోళనలను తెలియజేయడానికే తమ చర్యలని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

# తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు..

# 19 రోజుల్లోనే రూ.2,054 కోట్లు

- మొదటి పేజి తరువాయి

వేగంగా పెరిగాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈ ఏడాది ఆ సంఖ్య 30.37 లక్షల కేసులకు చేరింది. దీంతో బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఇక IMFL విక్రయాలు గత ఏడాది 14.16 లక్షల కేసులుగా ఉండగా, ఈసారి 18.38 లక్షల కేసులకు పెరిగాయి.అక్టోబర్ 19న రాష్ట్రంలో ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు నెమ్మదిగా సాగినా, రెండో వారం నుంచి వేగం పుంజుకున్నాయి. అక్టోబర్ 16 నాటికి మొత్తం విక్రయాల విలువ రూ.1,527.85 కోట్లుగా ఉండగా, మరో మూడు రోజుల్లోనే రూ.2,000 కోట్ల మార్కును దాటింది. అక్టోబర్ 19 వరకు నమోదైన గణాంకాల ఆధారంగానే ఈ వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

## దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి

దసరా పండుగ సందర్భంగా కొందరు స్వార్థపరులు బోనుల్లో బంధించిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'లకు హైదరాబాద్ నగర పోలీసులు విముక్తి కల్పించారు. పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, మొత్తం నాలుగు పాలపిట్టలను కాపాడినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు.

దసరా పండుగ నాడు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయాన్ని కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినా, కొందరు వాటిని పెడచెవిన పెట్టారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఓ ఆలయం దగ్గర రెండు పాలపిట్టలను, ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద ఒకటి, మంగళ్‌హాట్ బాలాజీనగర్ ఆలయం సమీపంలో మరో పాలపిట్టను బోనుల్లో బంధించి ఉంచారు.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తీవ్ర యాతనకు గురవుతున్న నాలుగు పాలపిట్టలను స్వాధీనం చేసుకుని, వాటిని కేబీఆర్ పార్క్ అటవీ శాఖ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులపై అటవీ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సజ్జనార్ తెలిపారు."స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని పండుగ పేరుతో బంధించి, తిండి, నీరు లేకుండా హింసించడం ఎవరికీ మంచిది కాదు. బోనులోని పక్షి ఆర్తనాదాలతో శుభం ఎలా కనిపిస్తుంది? జీవుల పట్ల కరుణ చూపడమే నిజమైన భక్తి కానీ, ప్రకృతిని బంధించడం కాదు" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలను ఎవరూ ప్రోత్సహించవద్దని, వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే 18004255364, 9803338666 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు

దసరా పండుగ సెలవులు ముగియడంతో నగరవాసులు తిరుగు ప్రయాణం పట్టారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) వాహనాలతో కిక్కిరిసిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరడంతో టోల్‌గేట్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.ముఖ్యంగా హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలు బారులు తీరాయి. కొన్ని సమయాల్లో అర కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. రద్దీని తగ్గించేందుకు అధికారులు హైదరాబాద్ వైపు ఉన్న 18 టోల్ బూత్‌లకు గాను 12 తెరిచి వాహనాలను పంపించారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉన్నప్పటికీ, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దీనికి తోడు, చిట్యాల, చౌటుప్పల్ వద్ద జరుగుతున్న అండర్‌పాస్, వంతెన నిర్మాణ పనులు కూడా వాహనాల రాకపోకల వేగానికి అడ్డంకిగా మారాయి.

అక్టోబర్ 22 నుంచి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానుండటంతో కుటుంబసభ్యులు, ఉద్యోగులు ఒకేసారి తిరుగు ప్రయాణం కావడం రద్దీకి ప్రధాన కారణంగా తెలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు టోల్ ప్లాజా సిబ్బందితో పాటు పోలీసులు, హైవే సిబ్బంది రంగంలోకి దిగారు. అదనపు సిబ్బందిని

నియమించి ఫాస్టాగ్ ప్రాసెసింగ్‌ను వేగవంతం చేశారు. కీలక కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఉండి వాహనాలను క్రమబద్ధీకరించారు. చిన్నపాటి జాప్యాలు మినహా ఎటువంటి పెద్ద ప్రమాదాలు జరగలేదని, ట్రాఫిక్ ప్రవాహం నిలకడగా కొనసాగిందని అధికారులు తెలిపారు.

పండుగకు వెళ్లే సమయంలోనూ ఇదే తరహా రద్దీ కనిపించింది. అక్టోబర్ 17న 24 గంటల వ్యవధిలో ఈ టోల్‌ప్లాజా నుంచి సుమారు 52,000 వాహనాలు వెళ్లాయి. అంటే నిమిషానికి సగటున 36 వాహనాలు రహదారిని దాటాయి. రాత్రి వరకు రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రయాణ సమయాన్ని అంచనా వేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉద్ధవ్‌పై ఎన్డీయే ఎదురుదాడి..

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరే చేసిన 'అధికార మార్పిడి', 'కాషాయ గుర్తింపు' వ్యాఖ్యలపై ఎన్డీయే కూటమి నేతలు తీవ్రంగా స్పందించారు. ఆయన మాటలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని, తిరస్కరించడం ఖాయమని స్పష్టం చేశారు. ముంబైలోని చరిత్రాత్మక ఛత్రపతి శివాజీ మహారాజ్ పార్క్‌లో దసరా సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఉద్ధవ్ థాకరే ఈ వ్యాఖ్యలు చేశారు.

**అసలేం జరిగింది?**

దసరా ర్యాలీలో ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ.. తాము అధికార మార్పిడి కోసమే ఇక్కడకు వచ్చామని ప్రకటించారు. ప్రజా ప్రయోజనాలను విస్మరించిన ఏ ప్రభుత్వాన్నైనా మార్చాల్సిందేనని అన్నారు. "కాషాయం మా గుర్తింపు. దానిని ఎవరూ మా నుంచి దొంగిలించలేరు. ఈ పవిత్ర కాషాయ పతాకాన్ని మహారాష్ట్ర అసెంబ్లీపైనే కాకుండా, ఢిల్లీ పీఠంపై కూడా ఎగరేయాలి" అని ఉద్ఘాటించారు.

**ఎన్డీయే నేతల ఘాటు స్పందన**

ఉద్ధవ్ థాకరే వ్యాఖ్యలపై ఎన్డీయే నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగారు. బీజేపీ ఎమ్మెల్యే రామ్ కదమ్ మాట్లాడుతూ "ఉద్ధవ్ ప్రసంగంలో 'ఆపరేషన్ టైగర్ 3' భయం స్పష్టంగా కనిపించింది. హిందుత్వాన్ని వదిలిపెట్టాననే పశ్చాత్తాపం ఆయన మాటల్లో కొట్టొచ్చినట్లు కనపడింది. అందుకే పదేపదే కాషాయం అనే పదాన్ని, ఛత్రపతి శివాజీ మహారాజ్ పేరును ఉచ్ఛరించారు" అని అన్నారు. సనాతన ధర్మాన్ని కించపరుస్తూ, కాషాయానికి ఉగ్రవాదాన్ని ముడిపెట్టే రాహుల్ గాంధీతో చేతులు కలపడం, అఫ్జల్ గురును కీర్తించే ఉమర్ ఖలీద్ వంటి వారికి మద్దతివ్వడం ఉద్ధవ్ థాకరే ద్వంద్వ వైఖరికి నిదర్శనమని రామ్ కదమ్ విమర్శించారు.

శివసేన అధికార ప్రతినిధి షైనా ఎన్సీ స్పందిస్తూ, "ఉద్ధవ్ 'స్కార్ఫ్ ధరించే' హిందుత్వం వద్దంటున్నారు. కానీ 2019లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నప్పుడు 'టోపీ ధరించే' హిందుత్వాన్ని స్వీకరించారు కదా?" అని ప్రశ్నించారు. "బాలాసాహెబ్ థాకరే గర్వంగా హిందువులమని చెప్పమన్నారు. కానీ ఉద్ధవ్ మాత్రం గర్వంగా అధికార మార్పిడి కోసం పనిచేయాలని చెబుతున్నారు. ఒకరిది నిజమైన హిందుత్వం అయితే, మరొకరిది నకిలీ సెక్యులరిజం" అని ఆమె తెలిపారు.

## మైసూరు ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

- మొదటి పేజి తరువాయి

కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని సీఎం దర్శించుకున్నారు. కన్నడ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళాకారులు, సంగీత బృందాలు, నృత్య బృందాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఈ ఊరేగింపులో ఆకర్షణీయంగా నిలిచాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, కళలు, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచేలా కర్ణాటక రాష్ట్ర పండగగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు రేవంత్‌రెడ్డి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో పాటు దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఉత్సవాలను వీక్షించారు. అంతకు ముందు రేవంత్‌రెడ్డి.. చాముండేశ్వరి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు

- మొదటి పేజి తరువాయి

మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు.బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.

## వేరే దేశానికి యురేనియం తరలించే ప్రసక్తే లేదు: ఇరాన్

- మొదటి పేజి తరువాయి

క్రమంలో తమ షరతులను పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు ఇరాన్ స్పష్టంగా చెప్పింది. తాము శుద్ధి చేసిన యురేనియాన్ని వేరే దేశానికి తరలించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది."శుద్ధి చేసిన యురేనియంలో ఒక్క గ్రాము కూడా ఇరాన్ నుంచి బయటకు వెళ్లదు. మాకు నమ్మకం కుదిరేలా అమెరికా చర్యలు తీసుకునే వరకు ఎలాంటి చర్చలు ఉండవు. ఇరాన్ విధించిన అన్ని షరతులను నెరవేర్చడంతోనే ఆ చర్చల ప్రక్రియ ప్రారంభం కావాలి" అని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహసెన్ రెజాయీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. మధ్యవర్తిత్వం కోసం ఇరాన్ వెళ్లిన జనరల్ మునీర్‌కు మొహసెన్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు.

**అప్పటి వరకు హార్మూజ్ మూసే ఉంటుంది..**

"హార్మూజ్ జలసంధి విషయంలో ఎలాంటి గందరగోళ వైఖరి లేదు. అమెరికా మా షరతులు అంగీకరించేంత వరకు హార్మూజ్ మూసే ఉంటుంది. ఇప్పటికే వెళ్తున్న మార్గాల్లో ఓడలకు సమస్యలు ఎదురవుతాయి. గత హామీలను అమెరికా గౌరవించేవరకు కొత్తగా చర్చలు ఏమీ ఉండవు" అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఓ ఇంటర్వ్యూలో పునరుద్ఘాటించారు.

## 1986 నుంచే నా దగ్గర రివాల్వర్ ఉంది

- మొదటి పేజి తరువాయి

ఆయన తన తుపాకీకి సంబంధించిన కొన్ని పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. తానున్న ఈ రివాల్వర్‌ను 1986లో సింగపూర్‌లో కేవలం 3 వేల రూపాయలకే కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ ఆయుధాన్ని కేవలం తన ఆత్మరక్షణ కోసమే దగ్గర ఉంచుకున్నానని ఆయన స్పష్టం చేశారు. దీనికి అప్పట్లోనే ఆల్ ఇండియా లైసెన్స్ పర్మిషన్ తీసుకున్నానని, 40 ఏళ్లుగా ఈ రివాల్వర్ తన వద్దే భద్రంగా ఉందని చెప్పారు.

# అమరవీరుల త్యాగనిరతి ఫలితమే నేడు సమాజంలో కనిపిస్తున్న శాంతి, సౌభ్రాతృత్వం: జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్







**ఖమ్మం ప్రతినిధి : అక్టోబర్, 21:** ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వర్తించిన పోలీసు అమరవీరుల త్యాగాల ఫలితమే నేడు సమాజంలో కనిపిస్తున్న శాంతి, సౌభ్రాతృత్వమని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం ఖమ్మం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్, జిల్లా పోలీస్ యంత్రాంగం, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళు లర్పించారు. తొలుత పోలీసు సాయుధ బలగాలు అమరవీరుల స్మృత్యర్థం పరేడ్ నిర్వహించి గార్డ్ ఆఫ్ హానర్ సమర్పించాయి. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గార్డ్ ఆఫ్ హానర్ పరేడ్‌కు ఆర్ఐ శ్రీశైలం ఇన్‌చార్జిగా వ్యవహరించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ఈ ఏడాది ప్రాణాలు కోల్పోయిన 155 మంది పోలీసు అమరవీరుల పేర్లను ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి చదివి వినిపించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ శాలువాలతో సత్కరించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం సైన్యం, ప్రజా శ్రేయస్సు కోసం పోలీస్ శాఖ రోజువారీ విధుల్లో ప్రదర్శించే నిబద్ధత, అంకితభావం, త్యాగాలే సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పునాది అని అన్నారు. జిల్లా పరిపాలన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో, ప్రగతికి తోడుగా కర్తవ్యం నిర్వహణలో ప్రజలకు రక్షణ, భద్రత, భరోసా కల్పిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి అండగా నిలుస్తూ, వారి బాధ్యతల నిర్వహణకు సహకరిస్తున్న పోలీసు కుటుంబ సభ్యుల సేవలు, వారి త్యాగాలను గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంతో పోలిస్తే నేరాల స్వరూపం గణనీయంగా మారిందని, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఇతర నూతన తరహా నేరాలు సమాజానికి సవాలుగా మారుతున్నాయని అన్నారు. ఇలాంటి నేరాలను సమర్థవంతంగా అరికట్టి ప్రజలకు భరోసా కల్పించే దిశగా దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ అగ్రస్థానంలో నిలుస్తోందని పేర్కొన్నారు.

పోలీస్, పరిపాలనా విభాగాలు ఒకే నాణేనికి రెండు పార్శ్వాల వంటివని, ఇరు విభాగాలు పరస్పర సమన్వయంతో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలను సాధించి రాష్ట్రాన్ని, దేశాన్ని ప్రగతి పథంలో మరింత ముందుకు సాగుతుందన్నారు.

**అమరవీరుల త్యాగాలు పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకం: సీపీ**

అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా బలగాల దాడిలో 10 మంది భారతీయ పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. వారి అసమాన త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజ శ్రేయస్సు, దేశ రక్షణ, భావితరాల భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, ఎక్కడ ఏ సంఘటన జరిగినా పోలీసులు తక్షణమే స్పందించి ప్రజలకు రక్షణ కల్పిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో గతంలో తీవ్రవాదం కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ప్రజలు తీవ్ర భయాందోళనల మధ్య జీవించాల్సిన పరిస్థితులు ఉండేవని అన్నారు. పోలీసు సిబ్బంది ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శాంతిభద్రతల పరిరక్షణకు చేసిన కృషి, త్యాగాల ఫలితంగా నేడు రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, సమాజంలో శాంతి సామరస్యాల పరిరక్షణ కోసం పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని అన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అమరవీరులు చూపిన ధైర్యం, అంకితభావం, కర్తవ్యనిష్ఠను ఆదర్శంగా తీసుకొని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజల భద్రత కోసం మరింత నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏఆర్ డీసీపీలు కుమారస్వామి, విజయబాబు, ఏఆర్ ఏసీపీలు సుశీల్ సింగ్, నర్సయ్య, ఏసీపీలు రమణమూర్తి, మహేష్, సాంబరాజు, నర్సింహారావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు హేమనాథ్, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు





## ఆకుల వెంకటేశ్వర్లుకు నివాళులర్పించిన సిపిఎం రాష్ట్ర సీనియర్ నేత పి. సోమయ్య..





**ఖమ్మం ప్రతినిధి : అక్టోబర్, 21:** ఖమ్మం :దంసలాపురము మాజీ సర్పంచ్ ఆకుల వెంకటేశ్వర్లు అకాలమరణం పట్ల సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు పి సోమయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, ట్రస్ట్ బోర్డర్ కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య, నగర కార్యదర్శి బైరిశెట్టి శ్రీనివాసరావు , గుండపనేని నాగేశ్వరరావు, బండారు రామ కృష్ణ, సిపిఎం నాయకులు కే నరసయ్య,శ్రద్ధాంజలి ఘటించారు . వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చాలని నివాళులు అర్పించారు. అనంతరం వారి కుమారుడు సుందరయ్య, వారి తమ్ముళ్ళు, కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు.

## కొనరావుపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా బుధవారం రోజున కొనరావుపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ...వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని,విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,డయల్ 112 కు కాల్ రాగానే పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఎస్పీ వెంట సిఐ రవికుమార్, ఎస్.ఐ రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

## మీట్యా తండ--వసంతాపురం తండ రహదారికి రూ.1.80 కోట్ల నిధులు

### నిధుల మంజూరుపై ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ భూక్య శైలజ నాగరాజు



**అనంతగిరి, అక్టోబర్ 21(ఆర్యాద్వి):** మీట్యా తండ నుంచి వసంతాపురం తండ మీదుగా నిర్మించనున్న రహదారికి రూ.1.80 కోట్ల నిధులు మంజూరు కావడంపై వసంతాపురం గ్రామ సర్పంచ్ భూక్య శైలజ నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వారు మాట్లాడుతూ.. మీట్యా తండ నుంచి వసంతాపురం తండ మీదుగా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కావడం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణంతో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు, రైతులు,వాహనదారులకు ప్రయాణ ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందన్నారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు కీలకమని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వారు పేర్కొన్నారు. రహదారి నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

## కోదాడలో ఘనంగా కనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర...



**కోదాడ, అక్టోబర్ 21( ఆర్యాద్వి):**కోదాడ పట్టణంలోని బాలాజీనగర్ డ్రైవర్ కాలనీలో కనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏఎన్ఆర్ టాక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి శోభాయాత్రను భారీ ఎత్తున నిర్వహించగా, కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మేళతాళాలు, ఉత్సాహభరితమైన నృత్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ అమ్మవారి శోభాయాత్ర వైభవంగా సాగింది. కాలనీలోని ప్రధాన వీధుల గుండా సాగిన యాత్రను తిలకించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ పట్టణానికి చెందిన వార్డు కౌన్సిలర్ చైతన్య నాయక్ పాల్గొన్నారు. అమ్మవారి శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులకు మేలు జరగాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.కనకదుర్గ అమ్మవారి ఉత్సవాలతో బాలాజీనగర్ డ్రైవర్ కాలనీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో సాగిన శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో ఏఎన్ఆర్ టాక్స్ అసోసియేషన్ సభ్యులు అనేం నరసింహారావు, వెంకటేశ్వర్లు, జంతిక నాగరాజు, ప్రవీణ్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన భక్తులు, స్థానికులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం



**అనంతగిరి, అక్టోబర్ 21 (ఆర్యాద్వి):** అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కాసాని నాగయ్య సతీమణి బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ గాదె వెంకన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో పాటు పేద వర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. గ్రామంలోని పేద కుటుంబాలకు ఏదైనా ఆపద వచ్చినప్పుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కష్టసుఖాల్లో కార్యకర్తలకు, పేదలకు తోడుగా నిలవడమే తన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కనగాల వీరయ్య, నాయకులు జెర్రిపోతుల నాగేశ్వరరావు, కాసాని వెంకటేష్ పాల్గొన్నారు.

## మాటిస్తే మడమతిప్పడు

**ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రజానాయకుడు "మాలోత్ నెహ్రూ నాయక్"**



**మహబూబాబాద్: అక్టోబర్, 21:** మానవత్వమే నిజమైన నాయకత్వానికి నిదర్శనం.. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ!
కురవి మండలం గాజా తండా గ్రామపంచాయతీ పరిధిలోని టేకులతండాకు చెందిన గూగులోత్ నరేష్ భార్య కళ్యాణి కుటుంబ కలహాల నేపథ్యంలో గత రెండు నెలల క్రితం ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విషాదకరమైన విషయం. తల్లిని కోల్పోయిన ఇద్దరు చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ఆ పిల్లలకు ఆర్థిక భరోసా కల్పించాలనే గొప్ప సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాలోత్ నెహ్రూ నాయక్ ముందుకు వచ్చారు.ఆ సమయంలో ఆ ఇద్దరు చిన్నారుల పేరుపై చెరో ?50,000 చొప్పున మొత్తం ?1,00,000 డిపాజిట్ చేస్తానని ఇచ్చిన హామీని ఈరోజు నిలబెట్టుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం టేకులతండాలోని వారి ఇంటికి స్వయంగా వెళ్లి, ఇద్దరు చిన్నారుల కోసం మొత్తం లక్ష రూపాయలను అందజేశారు.మాటలు చెప్పడం కాదు.. ఇచ్చిన మాటను చేతల్లో చూపించడమే నిజమైన నాయకుడి లక్షణం అని మాలోత్ నెహ్రూ నాయక్ మరోసారి నిరూపించారు.తల్లిని కోల్పోయి బాధలో ఉన్న చిన్నారులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, వారి భవిష్యత్తుకు తన వంతు సహాయం అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా మానవత్వానికి పెద్దపీట వేస్తూ, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలనే ఆయన ఆలోచన అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, అవసరమైన సమయంలో ఆదుకోవడానికి ముందుకు వచ్చే ఇలాంటి నాయకులు సమాజానికి ఎంతో అవసరమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకొని చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించిన మాలోత్ నెహ్రూ నాయక్ టేకులతండా గ్రామస్థులు ఎప్పటికీ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల నమ్మకమే ఆయన బలం..
మానవత్వమే ఆయన మార్గం..
ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే ఆయన నైజం!
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోతు శివలాల్, ఉప సర్పంచ్ హోసిలి వీరన్న, గ్రామ అధ్యక్షులు వాసు నాయక్, వార్డు సభ్యులు నవీన్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కిషన్, విజయ్, వెంకన్న, శంకర్, సూర్య, వీరన్న, నరీయ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు ఖమ్మంలో 22వతేదీన వామపక్షాలతో కలిసి తలపెట్టిన ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలి రావలసిందిగా బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు



**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 21:** నిరుపేదలకు ఇండ్లు కేటాయించే విషయంలో అధికార పార్టీ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు.ఇందుకు నిరసనగా వామపక్షాలతో కలిసి ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఈనెల 22వతేదీ గురువారం ఉదయం తలపెట్టిన ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాల్సిందిగా ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర ఖమ్మం తెలంగాణ భవన్ లో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య,జేడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్ తదితర నాయకులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన నిరుపేదలకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టేందుకు వామపక్షాలు కలిసి రావడం అభినందనీయమన్నారు.ఇండ్ల మంజూరు సంబంధించి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 33 రద్దు గురించి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావుతో మాట్లాడి న్యాయపోరాటం చేస్తామన్నారు.ఈ జీవో ద్వారా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తూ,వాటిని మొత్తంగా కాంగ్రెస్ నాయకులతో నింపారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు.కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ లోకి వలస పోకుండా ఉండేందుకే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసినట్లుగా కనిపిస్తున్నదన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో డబుల్ బెడ్ రూం ఇండ్లను గొప్పగా నిర్మించి రాజకీయాలకు అతీతంగా లాటరీ పద్ధతిలో కేటాయించి అర్హులైన ఏ ఒక్కరి కూడా అన్యాయం జరుగకుండా చేశారని ఎంపీ వద్దిరాజు వివరించారు.ఇప్పటి పాలకులు లాటరీ పద్ధతికి స్వస్తి పలికి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో అసలైన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని విధాలా విఫలం కావడంతో దిక్కుతోచని స్థితిలో బీఆర్ఎస్ బాటపట్టేందుకు సిద్ధంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలను పాలకులు పోలీసుల చేత బెదిరిస్తున్నారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.ఈవిధంగా రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన కొనసాగుతున్నదని, జిల్లాలోని పేదలకు మేలు చేయడంలో ముగ్గురు మంత్రులు పూర్తిగా విఫలం చెందారని ఆయన విమర్శించారు.ఇండ్ల కేటాయింపులో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగకుండా, కాంగ్రెస్ వారితో నింపిన ఇందిరమ్మ కమిటీల రద్దు కోసం ఖమ్మం కలెక్టరేట్ వద్ద గురువారం ఉదయం (రేపు, 22వతేదీ)నిర్వహించే ధర్నాకు గులాబీ జెండాలు చేతబూని పెద్ద సంఖ్యలో తరలి రావలసిందిగా ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు పగడాల నాగరాజు, బెల్లం వేణు,ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకుదెరువు కోసం వస్తే.. వలస కూలి పై దాడి!

- 19 ఏళ్ల వలస యువకుడికి తీవ్ర గాయాలు ఖమ్మం తరలింపు
- దాడి చేసిన వ్యక్తి పై పోలీస్ కట్టిన చర్య తీసుకోవాలి..
- వృకాస జిల్లా ఉపాధ్యక్షులు కొండేబోయిన నాగేశ్వరరావు డిమాండ్..




**సింగరేణి: అక్టోబర్, 21:** పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన 19 ఏళ్ల వలస కూలీపై దాడి జరిగిన ఘటన సింగరేణి మండలంలో కలకలం రేపింది.మాణిక్యారం గ్రామంలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో రాజు (19) అనే యువకుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు.స్థానికుల కథనం ప్రకారం..బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రం నుంచి వచ్చి మాణిక్యారం ప్రాంతంలో కూలి పని చేసుకుంటున్న రాజు పై అదే గ్రామానికి చెందిన ఓ రైతు దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.దాడిలో తీవ్రంగా గాయపడిన రాజు ను స్థానికులు వెంటనే కారేపల్లి పోలీస్ స్టేషన్ కు తీసుకురాగా పోలీస్ వారు వివరాలు సేకరించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం,గాయాల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మెరుగైన వైద్యం కోసం కారేపల్లి లో అంబులెన్సు అందుబాటులో లేక ఆటోలో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.
పొట్టకూటి కోసం వస్తే.. దాడా? కారుకులపై కఠిన చర్య తీసుకోవాలి కొండబోయిన నాగేశ్వరరావు
కుటుంబాన్ని పోషించుకునేందుకు సుదూర ప్రాంతం నుంచి వచ్చి కూలి పని చేసుకుంటున్న వలస కూలి రాజు (19) పై మాణిక్యరం గ్రామానికి చెందిన భూక్య కోటయ్య అనే రైతు. దాడి చేయడానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు ఆయన విలేకరులతో మాట్లాడుతూ తీవ్రంగా గాయపడిన రాజుని తీసుకొని ఘటనపై కారేపల్లి పోలీసులకు సహచర కూలీలు స్థానికులు ఫిర్యాదు చేయుటకు వస్తే కేసు నమోదు చేయకుండా. దాడికి పాల్పడిన రైతు ని స్టేషన్ కి రప్పించకుండా. గాయపడిన కూలిని హాస్పటల్ తీసుకెళ్లమని పోలీస్ శాఖ సలహా ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదని. కూలి పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనపై విచారణ జరిపి దాడికి పాల్పడిన రైతుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్య తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు ఇతర రాష్ట్రాల నుండి వలస కూలీలని రప్పించుకొని వారికున్న ఆర్థిక పరిస్థితిని ఆసరా చేసుకుని. అతి తక్కువ కూలి ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకోవడమే కాకుండా ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని. గత కొద్దిరోజుల క్రితం కూడా సంబంధిత రైతు. వలస కూలి రాజు పై దాడి చేయగా అతను సంబంధిత వ్యక్తి దగ్గర కూలి పని మానివేసి మరొక రైతు వద్దకు వెళ్లి పనిచేస్తున్నాడని కుట్రతో తన వద్ద పని మానేశాడు కక్షపూరితంగానే దాడి చేసి తీవ్రంగా గాయపరచడం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖండిస్తుందని దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం పాటు గాయపడిన రాజు వైద్య ఖర్చులు మొత్తమును దాడికి పాల్పడిన రైతు చెల్లించి మెరుగైన వైద్యం అందించేలా పోలీస్ వారు చర్యలు తీసుకొని భవిష్యత్తులో పేదలైన కూలీలపై దాడి లాంటి ఘటనలు నివారించాలని ఆయన కోరారు ఈ ఘటన ఖండించిన వారిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సింగరేణి మండల అధ్యక్ష కార్యదర్శులు కేశగాని ఉపేందర్ యనమనగండ్ల రవి తదితరులు ఉన్నారు

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**అమరుల స్ఫూర్తితో ప్రజా రక్షణకు అంకితభావంతో పనిచేయాలి: జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్**





**మహబూబాబాద్ :అక్టోబర్, 21:**పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులకు ఘన నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఐఏఎస్, ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్విధి నిర్వహణలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఐఏఎస్తో కలిసి అమర పోలీసులకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళు లర్పించారు.

**హాట్ స్ప్రింగ్స్ ఘటన అమరుల త్యాగానికి ప్రతీక**
1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద దేశ రక్షణ విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో పోలీసుల పాత్ర కీలకమని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు ప్రతి పోలీసు అధికారికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**అమరవీరుల కుటుంబాలకు అండగా పోలీసు శాఖ**
తెలంగాణలో గతంలో నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో అనేక మంది పోలీసులు ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేశారని ఎస్పీ గుర్తుచేశారు. విధి నిర్వహణలో చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులకు నివాళి**
2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీసు సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యతని ఎస్పీ అన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీసు సిబ్బంది ఉన్నారని తెలిపారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**పోలీస్--ప్రజల మధ్య సత్సంబంధాలే లక్ష్యం**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం అనగా ఈరోజు 21 నుంచి అక్టోబర్ 31న నిర్వహించే సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం వరకు పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేసే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీస్--ప్రజల మధ్య పరస్పర నమ్మకాన్ని బలోపేతం చేస్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యం. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల రక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి అని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

## సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్



**మెదక్:** : శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని లికలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం అక్టోబర్ 21 పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెదక్ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, తో కలిసి లికలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు.
ముందుగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు సమర్పించి నివాళులర్పించారు.
**రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.**
తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా... విధులను నిర్వహిస్తూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు.విరామం లేకుండా అనునిత్యం పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే కాకుండా జిల్లా లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో అలాగే.... అకాల వర్షం వచ్చినప్పుడు... ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు తదితర సందర్బలల్లోప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ అధికారులు భాగస్వామ్యం అవుతున్నారన్నారు
ప్రతి రోజు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా ముందుకు వెళ్లే పోలీస్ అధికారులు స్ఫూర్తిదయాకమన్నారు
పోలీస్ అమరుల త్యాగాలను వృధా కానివ్వకుండా, వారి స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయం గా విధుల్లో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా లో శాంతిభద్రతలు నెలకొని ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు
ప్రస్తుత సమాజంలో మారుతున్న నేర స్వరూపానికి అనుగుణంగా పోలీసులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ... అతి తక్కువ వ్యవధిలో ఎంతో చాకచక్యంగా సైబర్ నేరాలను ఛేదిస్తూ, నేరస్థులను పట్టుకుంటున్నారన్నారుఅమరవీరుల కుటుంబాలకు గిఫ్ట్ ప్యాక్ లు కలెక్టర్ ,ఎస్పీఅందించారువ్యాచారచన పోటీలలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారుఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పీ
డీవి శ్రీనివాసరావు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,సిఐలు, ఎస్హెచ్ఓ, తదితరులు పాల్గొన్నారు

# అపూర్వ కలయిక.. ఆత్మీయ బంధాల వేదిక







**ఖమ్మంలో ఘనంగా గడల వంశీయుల సమ్మేళనం.**

**ప్రజాసేవలో రాణించేందుకు ఆశీర్వదించాలని డాక్టర్ గడల శ్రీనివాసరావు పిలుపు.**

**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 21:** ఎక్కడా జరగని విధంగా రక్తసంబంధాలు, అనుబంధాలకు పెద్దపీట వేస్తూ గడల వంశీయులు, వారి ఆడబిడ్డల కుటుంబాల ఆత్మీయ కలయిక బుధవారం ఖమ్మంలో అత్యంత వైభవంగా జరిగింది. సుమారు 50 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న వంశీయులు, ఆడబిడ్డలు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమానికి మాజీ హెల్త్ డైరెక్టర్, ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉమ్మడి జిల్లాల జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

గడల పెద్దల ఆలోచనలతో రూపుదిద్దుకున్న ఈ సమ్మేళనానికి కేవలం స్థానికులే కాకుండా ముంబై, హైదరాబాద్, బెంగుళూరు , చెన్నై వంటి సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన గడల వంశీయులు సైతం తరలివచ్చారు. దాదాపు ఏడు తరాల చరిత్ర కలిగిన గడల వంశం తమ మూలాలను మర్చిపోకుండా, భవిష్యత్ తరాలకు తమ బంధుత్వాలను పరిచయం చేసేలా ఈ వేడుకను నిర్వహించుకున్నారు. సాధారణంగా వంశ వృక్షం అంటే కేవలం మగవారి పేర్లతోనే ఉంటుందని, కానీ ఇంటికి దీపంలా వెలుగునిచ్చే ఆడబిడ్డలను, వారి కుటుంబాలను కలుపుకొని ఇలాంటి వేడుక నిర్వహించడం చరిత్రలో నిలిచిపోతుందని వక్తలు కొనియాడారు.

వేదికపై మాట్లాడిన వంశ పెద్దలు గడల వంశ మూలాలను, తరతరాల చరిత్రను సభికులకు వివరించారు. పూర్వం సుదూర గ్రామల నుంచి ఖమ్మంలోని కాల్వొడ్డు ప్రాంతానికి వలస వచ్చిన పెద్దలు ఎంతో కష్టపడి, ఐకమత్యంతో కుటుంబాన్ని వృద్ధిలోకి తెచ్చారని గుర్తుచేశారు. గడల ముత్తయ్య, గడల లక్ష్మయ్య, గడల రామలింగయ్య, గడల ఎల్లయ్య, గడల నరసయ్య వంటి పెద్దలు వేసిన బలమైన పునాదుల వల్లే నేడు గడల వంశం ఇంతటి స్థాయికి చేరుకుందని కొనియాడారు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలుగా ఒకే ఇంట్లో ఎంతో అన్యోన్యంగా ఉండేవారని, నేడు కాలక్రమేణా ఉపాధి నిమిత్తం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ, మళ్లీ అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడానికి ఇలాంటి సమ్మేళనాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. నేటి యువతరం తమ పెద్దలను, రక్తసంబంధీకులను గుర్తుపట్టేందుకు ఈ వేదిక ఒక వారధిలా నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ వంశం తరతరాలుగా సమాజ సేవలో ముందుందని గుర్తుచేశారు. 80 ఏళ్ల క్రితమే తమ పూర్వీకులు దేవాలయాల నిర్మాణానికి కృషి చేశారని, ముత్యాలమ్మ గుడి, శివాలయం, శ్రీరామనవమి ఉత్సవ కమిటీలలో గడల వంశీయుల పాత్ర మరువలేనిదని తెలిపారు. సమాజంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవడం తమ ఇంటి సంప్రదాయమని, కరోనా కష్టకాలంలో వేలాది మందికి వైద్య సహాయం అందించే అవకాశం ఆ భగవంతుడు తనకు కల్పించాడని పేర్కొన్నారు.

అనంతరం తన రాజకీయ ప్రస్థానం, భవిష్యత్ లక్ష్యాల గురించి గడల శ్రీనివాసరావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రభుత్వ వైద్యుడిగా, ప్రజారోగ్య సంచాలకులుగా (హెల్త్ డైరెక్టర్‌గా) తన వంతు సేవలు అందించానని, అయితే సమాజంలో మార్పు తీసుకురావడానికి, పేద ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేయడానికి రాజకీయ వేదిక ఎంతో అవసరమని భావించి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టినట్లు తెలిపారు. రాజకీయాల్లో ఏ ఒక్కరినీ వ్యక్తిగతంగా విమర్శించే ఉద్దేశం తనకు లేదని, కేవలం నిర్మాణాత్మక, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలన్నదే తన అభిమతమని స్పష్టం చేశారు. సమాజ హితం కోరే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు తనను ఎంతగానో ఆకర్షించాయని అన్నారు.పవన్ కళ్యాణ్ తనపై ఉంచిన అపారమైన నమ్మకంతో ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉమ్మడి జిల్లాల జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసే గొప్ప అవకాశాన్ని కల్పించారని శ్రీనివాసరావు సభాముఖంగా తెలిపారు. పవన్ కళ్యాణ్ ఇచ్చిన ఈ సువర్ణావకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని, ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యావంతులు, సేవాభావం కలిగిన వ్యక్తులు చట్టసభల్లోకి అడుగుపెట్టినప్పుడే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని, ఈ ప్రజా ప్రస్థానంలో తనను ఆశీర్వదించి అఖండ మెజారిటీతో గెలిపించాలని సభికులను, ప్రజలను ఆత్మీయంగా కోరారు. ఇంటి బిడ్డగా తనకు కుటుంబ సభ్యులు, ఆడబిడ్డల అండదండలు ఎల్లప్పుడూ ఉండాలని, ఈ ఆత్మీయ కలయిక తనకు కొండంత బలాన్ని, నూతనోత్సాహాన్ని ఇచ్చిందని భావోద్వేగంగా మాట్లాడారు.

ఈ ఆత్మీయ సమ్మేళనం వేదికగా గడల శ్రీనివాసరావు మరో కీలక ప్రకటన చేశారు. గడల వంశీయులు, ఆడబిడ్డల కుటుంబాలలో ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకునేందుకు 'గడల చారిటబుల్ ట్రస్ట్'ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తన తండ్రి గడల రామలింగయ్య జ్ఞాపకార్థం ఇప్పటికే జీఎస్ఆర్ (+ూ=) ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నప్పటికీ, వంశీయుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఈ కొత్త ట్రస్ట్‌ను తీసుకొస్తున్నట్లు చెప్పారు. పేద పిల్లల చదువులు, అత్యవసర వైద్య ఖర్చులు, ఆడబిడ్డల పెళ్లిళ్లు, యువతకు ఉపాధి కల్పనలో ఈ ట్రస్ట్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ ట్రస్ట్ కోసం తన వంతుగా తక్షణమే రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఆర్థికంగా స్థితిమంతులైన వంశీయులు కూడా తమ వంతు సహకారం అందించి, కష్టాల్లో ఉన్న తోటి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ ఆత్మీయ కలయిక కేవలం ఒక్క రోజుకే పరిమితం కాకూడదని, ప్రతి ఏటా లేదా రెండేళ్లకోసారి క్రమం తప్పకుండా నిర్వహించుకుంటూ ఈ బంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఆటపాటలు, పాత జ్ఞాపకాల నెమరువేతలతో, కుటుంబ సభ్యుల ఆనంద భాష్పాలతో ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమ నిర్వాహకులకు, వంటకాలు సిద్ధం చేసిన వారికి, వేదికను అలంకరించిన ప్రతి ఒక్కరికీ శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## మదనపల్లి, రాయచోటి లలో పోలీసుల ర్యాలీ

**హైదరాబాద్ పెన్ పవర్:** అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎస్పీ ధీరజ్ కనుమిలి ఆధ్వర్యంలో మదనపల్లి రాయచోటి లలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ ధీరజ్ మాట్లాడుతూసమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మదనపల్లెలోని బీటీ కళాశాల పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసులతో పాటు, జిల్లాలో వివిధ కారణాలతో మృతి చెందిన తొమ్మిది మంది పోలీసులను స్మరించుకున్నారు.త్యాగాలకు ప్రతీక.. అక్టోబర్ 21ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లో చైనా సైనికుల దాడిలో పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు వీరమరణం పొందిన ఘటనకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ రక్షణతో పాటు ప్రజల భద్రత కోసం నిరంతరం సవాళ్లను ఎదుర్కొంటూ, నిస్వార్థంగా సేవలందిస్తున్న పోలీసుల త్యాగాలు సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు.ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు, సమాజంలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. అన్నమయ్య జిల్లా పోలీసులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ధైర్యం, అంకితభావం పోలీసుల విధి నిర్వహణకు బలంలిజిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ.. "ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు.. భయం ఉన్నప్పటికీ బాధ్యతతో ముందడుగు వేయడం" అని పేర్కొన్నారు. దేశ రక్షణలో, ప్రజల భద్రతలో అమరులైన పోలీసుల ధైర్యసాహసాలు, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఉగ్రవాదులు, నక్సలైట్లు, నేరస్థులతో పోరాడుతూ అనేకమంది పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు.కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహించారని తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలు చేసిన త్యాగాలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి ఏ అవసరం వచ్చినా సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు.అమరులకు ఘన నివాళులు.. పోలీసు అమరవీరుల స్మారక ర్యాలీ.కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన 154 మంది పోలీసుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు పరేడ్ మైదానం నుంచి అనిబిసెంట్ సర్కిల్ వరకు స్మారక ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ ర్యాలీలో సాయుధ పోలీసు బలగాలు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల భద్రత పట్ల వారి అంకితభావాన్ని చాటిచెప్పారు.అమరుల కుటుంబాలకు అండగా పోలీసు శాఖకార్యక్రమం ముగింపులో జిల్లాలో మృతి చెందిన పోలీసుల కుటుంబ సభ్యులకు అధికారులు నగదు బహుమతులు అందజేశారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అమరుల కుటుంబాల సంక్షేమానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# దసరా వేడుకల్లో మంత్రి "పొంగులేటి శ్రీనివాసరెడ్డి"











ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 21:దసరా పర్వదినం సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన స్వగ్రామం నారాయణపురంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.లిఅనంతరం సత్తుపల్లి మండలం రేజర్లలోని దుర్గా నాగమల్లేశ్వర స్వామి ఆలయంలో శివాద్రి గిరి ప్రదక్షిణను ప్రారంభించి, స్వామివారిని దర్శించుకున్నారు.లికుటుంబ సమేతంగా జమలాపురం వేంకటేశ్వరస్వామి, తక్కెళ్లపాడు లలితా రాజరాజేశ్వరి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.లిఅలాగే ఇల్లెందులో జరిగిన దసరా వేడుకల్లో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.



ఆర్యాద్వి **సంపాదకీయం** Editorial




## వారికి కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్.. ఇలాగైతే టిక్కెట్ కష్టమేనని సిగ్నల్స్

**తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ విజయం సాధించాలని బీఆర్ఎస్ పార్టీ వ్యూహం రచిస్తోంది. కేటీఆర్ నేతృత్వంలో పార్టీ వర్గాలు ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వంపై యువతలో ఉన్న అసంతృప్తిని ఓట్లుగా మలుచుకోవాలని గులాబీ పార్టీ భావిస్తోంది. అయితే ఇన్ ఛార్జులు ఓటర్ల నమోదులో విఫలమయ్యారని గులాబీ పార్టీ నాయకత్వం భావిస్తుంది. బీఆర్ఎస్ పార్టీ ఇన్ ఛార్జులు కొందరు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటూ, చర్యలు తీసుకోకపోతే చర్యలు తీసుకోకతప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిధిలో ఆరు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఇన్ ఛార్జులు వ్యవహార శైలి పార్టీకి రాజకీయంగా ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి.**

### వ్యూహాలు అమలు చేయాలనుకున్నా...

అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడంపై బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. కానీ కొందరు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. తమ ఎన్నికలు కావనే నిర్లక్ష్యం వారిలో కొట్టొచ్చినట్లు కనపడుతుందని, ఇలాగే చేస్తే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు కూడా కష్టమవుతుందని అన్నారు. జాబ్ నోటిఫికేషన్లు, ఉద్యోగ భర్తీలో జాప్యం మరియు ఇచ్చిన ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడంలో విఫలమైందనే విషయాన్ని గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగుల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. అయితే అందులోనూ ఇన్ ఛార్జులు వెనకబడే ఉన్నారని తెలిసింది. రెండేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావిస్తూ, పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసేందుకు కేటీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు.

### సోషల్ ఇంజినీరింగ్ తో...

అభ్యర్థుల ఎంపికలో కేసీఆర్ వ్యూహాత్మకంగా సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తూ బలమైన అభ్యర్థులను బరిలోకి దించాలని కసరత్తు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఇన్ ఛార్జులతో మాట్లాడుతున్నారు. తాను స్వయంగా నరసన్నపేట ఇన్ ఛార్జి బాధ్యతలను కేటీఆర్ తీసుకున్నారు. మరొక నేతకు అప్పగించకుండా తానే అన్నీ చూసుకుంటానని కేటీఆర్ చెప్పారు. నరసన్నపేట ఇన్ ఛార్జి సుదర్శన్ రెడ్డి మరణంతో అక్కడ మరొక నేతకు ఇన్ ఛార్జి పదవి అప్పగించాలని తొలుత నిర్ణయించినా ఎవరిపైన నమ్మకంలేకనే ఇటువంటి నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన ఇన్ ఛార్జులపైన దాదాపు పదిహేనుకు పైగా ఇన్ ఛార్జులు ఇన్ యాక్టివ్ గా ఉన్నారని గుర్తించిన బీఆర్ఎస్ నాయకత్వం వారికి తొలుత గట్టిగా హెచ్చరికలు జారీ చేసింది. అనంతరం కూడా వారి తీరు మారకపోవడంతో కేటీఆర్ ను కలిసేందుకు వచ్చిన ఆ ఇన్ ఛార్జులను పెద్దగా పట్టించుకోలేదని, అదే సిగ్నల్స్ ఇచ్చారంటున్నారు నేతలు. ఇప్పటికైనా నేతలు మారితే మంచిది. లేకుంటే అసలుకే ఎసరు వస్తుందని గులాబీ పార్టీ నాయకత్వం భావిస్తుంది

**ఎల్‌నినో ప్రభావం రానున్న నెలల్లో ప్రపంచ వాతావరణంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో 2026 చివరి నుంచి 2027 ప్రారంభం వరకు బలమైన ఎల్‌నినో కొనసాగవచ్చని అమెరికా వాతావరణ అంచనా సంస్థ చీమాహా వెల్లడించింది. దీని ప్రభావం భారత్‌లో ఉష్ణోగ్రతలు, వర్షపాతం, వ్యవసాయం, నీటి లభ్యతపై ఎలా ఉంటుందనే అంశంపై నిపుణులు దృష్టి సారిస్తున్నారు. అయితే ఎల్‌నినో ప్రభావం అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండదని గుర్తించాలి.**

### నీటి పొదుపే ప్రధాన రక్షణ

**వర్షపాతంలో లోటు ఏర్పడే పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి. కుళాయిలు తెరిచి వదిలేయడం, అవసరానికి మించి నీటిని వినియోగించడం తగ్గించాలి. ఇళ్లలో వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామాలు, పట్టణాల్లో చెరువులు, ఇతర నీటి వనరులను కాపాడుకోవడం కూడా కీలకమే.**




### ఎండల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోండి

వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదైతే వడదెబ్బ, శరీరంలో నీటి శాతం తగ్గడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందువల్ల వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ, ఎండ తీవ్రంగా ఉండే మధ్యాహ్న వేళల్లో బయట తిరగడం తగ్గించాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ ఉపయోగించాలి. తగినంత నీరు తాగాలి. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం.

### ఎండలో పనిచేసేవారికి ప్రత్యేక జాగ్రత్తలు

వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, నిర్మాణ రంగ కార్మికులు ఎండ తీవ్రతను బట్టి పనివేళలను మార్చుకోవడం మంచిది. సాధ్యమైనంతవరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయంలో పనికి విరామం ఇవ్వాలి. పనిచేసే ప్రదేశాల్లో నీడ, తాగునీరు అందుబాటులో ఉండేలా సంబంధిత యజమానులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

### రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేయాలి

వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయ రంగంపై ఒత్తిడి పెరగవచ్చు. రైతులు తమ ప్రాంతంలోని నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల ఎంపికపై నిర్ణయం తీసుకోవాలి. తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, నేలలో తేమను కాపాడే పద్ధతులపై వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి. వాతావరణ సూచనలకు అనుగుణంగా సాగు ప్రణాళికలను మార్చుకోవాలి.

### భారీ వర్షాల హెచ్చరికలనూ నిర్లక్ష్యం చేయొద్దు

ఎల్‌నినో అంటే కేవలం కరువు లేదా ఎండలు మాత్రమే కాదు. ప్రాంతాన్ని బట్టి వర్షపాతంలో మార్పులు, కొన్ని చోట్ల భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు కూడా సంభవించవచ్చు. అందుకే వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ అధికారులు జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలి. లోతట్టు ప్రాంతాల్లో నివసించేవారు అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి.

### ముందస్తు అప్రమత్తతతోనే నష్టాలను తగ్గించవచ్చు

ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుంది, దేశంలోని ఏ ప్రాంతాలపై ఎక్కువ ప్రభావం చూపుతుంది అనే అంశాలపై తాజా వాతావరణ అంచనాలను అనుసరించాలి. 2027లో తప్పనిసరిగా తీవ్రమైన కరువు వస్తుందని ఇప్పుడే నిర్ధారించలేం. అయితే నీటి సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ, వ్యవసాయ ప్రణాళిక, అధికారిక హెచ్చరికలపై అప్రమత్తత వంటి చర్యలు ముందుగానే చేపట్టడం వల్ల సంభావ్య నష్టాలను తగ్గించుకోవచ్చు.

**రచయితలకు ఆహ్వానం!**
మీ ఆలోచనలకు అక్షరరూపం ఇవ్వండి..
మీ రచనలు, కథలు, కవితలు, వ్యాసాలు, సామాజిక అంశాలపై మీ అభిప్రాయాలను ఆర్యాద్వి పత్రిక ద్వారా పాఠకులకు చేరవేయండి.
మీ రచనలకు మా వేదికపై ప్రత్యేక స్థానం కల్పిస్తాం.
ఆసక్తి ఉన్న రచయితలు తమ రచనలను మాకు పంపించండి




పంపాల్సిన చిరునామా:
వాట్సాప్ నంబర్:
9912456573



# భువనేశ్వర్ రీఎంట్రీకి కారణం అదే!

## అసలు విషయం బయటపెట్టిన శ్రేయస్..!

టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ సుదీర్ఘ విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి అడుగుపెట్టాడు. సరిగ్గా నాలుగేళ్ల తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన భువీ, న్యూజిలాండ్‌తో జరగనున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ఎంపికయ్యాడు. అంతకుముందు బెంగళూరు వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన చివరి టీ20లో అవకాశం లభించినప్పటికీ వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కావడంతో బౌలింగ్ చేసే అవకాశం రాలేదు. దీంతో కివీస్‌తో జరిగే తొలి టీ20తోనే అతడి అసలైన రీఎంట్రీ ఉండనుంది. భువనేశ్వర్‌ను తిరిగి జట్టులోకి ఎంపిక చేయడానికి గల అసలు కారణాలను టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తాజాగా మీడియాతో పంచుకున్నాడు. గత కొంతకాలంగా భారత బౌలింగ్ విభాగంలో అనుభవజ్ఞులైన ఆటగాళ్ల కొరత వేధించిందని, భువీ రాకతో ఆ లోటు పూర్తిగా భర్తీ అవుతుందని అయ్యర్ స్పష్టం చేశాడు. “మా జట్టులో చాలా మంది యువ పేసర్లు ఉన్నారు. అయితే పవర్‌ప్లేలో, డెత్ ఓవర్లలో ప్రత్యర్థిపై ఎలా ఆధిపత్యం చెలాయించాలనే అనుభవం భువనేశ్వర్‌కు మెండుగా ఉంది. గత రెండు ఐపీఎల్ సీజన్లలో అతను అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. అందుకే పేస్ విభాగానికి అనుభవం అవసరమనే ఉద్దేశంతోనే అతన్ని ఎంపిక చేశాం” అని శ్రేయస్ అయ్యర్ కొనియాడారు. 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ గతంలో ఫామ్ కోల్పోవడంతో పాటు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించే క్రమంలో జట్టుకు దూరమయ్యాడు. అయితే దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో తన నిలకడైన ప్రదర్శనను కొనసాగించి మళ్లీ సెలక్టర్ల నమ్మకాన్ని చూరగొన్నాడు. ప్రస్తుత న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక చేసిన జట్టులో నలుగురు స్పెషలిస్ట్ పేసర్లు, ఇద్దరు పేస్ ఆల్‌రౌండర్లు ఉన్నప్పటికీ.. కొత్త బంతితో స్వింగ్ రాబట్టడంలో సిద్ధహస్తుడైన భువీ ప్రదర్శనపైనే అందరి దృష్టి నిలిచింది. ఈ సిరీస్‌లో భువనేశ్వర్ రాణించడం ద్వారా తన అంతర్జాతీయ కెరీర్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉంది.

# 18 ఏళ్ల రికార్డు బద్దలు

## బౌలర్‌గా వచ్చి బ్యాటింగ్‌లో అదరగొట్టిన సైమన్ హార్మర్!

కొన్నిసార్లు కేవలం బౌలింగ్ చేయాల్సిన వారే బ్యాట్‌తో విధ్వంసం సృష్టిస్తుంటారు. సరిగ్గా అలాంటి అద్భుతమే ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో చోటుచేసుకుంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ బ్యాటింగ్‌తో అద్భుత ప్రదర్శన చేశాడు. ఏకంగా 18 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గెబార్హాలోని సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో హార్మర్ 82 పరుగులు చేసి డేల్ స్టెయిన్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. తొలి టెస్టులో విజయం సాధించిన ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యంలో కొనసాగుతుండగా, రెండో టెస్టులో సఫారీలు అద్భుత పోరాటంతో మ్యాచ్‌ను రంజుగా మార్చారు. మ్యాచ్ మూడో రోజు సైమన్ హార్మర్ కేవలం 91 బంతుల్లోనే 10 ఫోర్లు, 1 సిక్సర్‌తో ఉప్పొంగిపోయి 82 పరుగులు సాధించాడు. టెస్టుల్లో ఆస్ట్రేలియాపై 9వ స్థానంలో లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా ఆటగాళ్లలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నిలిచింది. గతంలో 2008 మెల్‌బోర్న్ టెస్టులో డేల్ స్టెయిన్ చేసిన 76 పరుగులే అత్యధికంగా ఉండేది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 110 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ తరుణంలో కెప్టెన్ టెంబా బవుమా, మార్కో జాన్సెన్ (85) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 132 పరుగులు జోడించారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సైమన్ హార్మర్.. కెప్టెన్ బవుమాతో కలిసి ఎనిమిదో వికెట్‌కు అద్భుతమైన 183 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. దక్షిణాఫ్రికా టెస్టు చరిత్రలో ఎనిమిదో వికెట్ లేదా అంతకంటే దిగువన నమోదైన అత్యుత్తమ భాగస్వామ్యాల్లో ఇది రెండోది కావడం విశేషం.

### కెప్టెన్ బవుమా మారథాన్ ఇన్నింగ్స్:

మరోవైపు దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా అన్ని ఒత్తిళ్లను ఎదుర్కొంటూ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 334 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్సర్‌తో ఏకంగా 179 పరుగులు సాధించాడు. తొలి రోజు స్వల్ప స్కోరుకే వికెట్లు కోల్పోయిన దశలో బాధ్యతాయుత ఆటతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. సెంచరీ దిశగా సాగిన హార్మర్.. లబుషేన్ బౌలింగ్‌లో ఔట్ కాగా, అనంతరం బవుమా కూడా పెవిలియన్ చేరడంతో దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌ను 425/9 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 1 వికెట్ కోల్పోయి 3 పరుగులు చేసింది. సఫారీ పేసర్ కగిసో రబాడా నిక్ మ్యాడిన్సన్‌ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఈ మ్యాచ్‌లో సఫారీ ఆటగాళ్ల పోరుతో టెస్టు సిరీస్ మరింత రసవత్తరంగా మారింది.



# భారత్ ఖాతాలో 54 పతకాలు!

## పారా ఆసియా క్రీడల్లో పతకాల పంట..

- 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్యాలతో భారత అథ్లెట్ల జోరు
- 100, 200 మీటర్ల పరుగులో రెండు స్వర్ణాలు సాధించిన సిమ్రాన్
- పురుషుల 100 మీటర్ల టీ47 విభాగంలో దిలీప్‌కు పసిడి
- 400 మీటర్ల పరుగులో అకీరా నందన్ బానోతుకు రజతం
- పతకాల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతున్న భారత్





పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. జపాన్ వేదికగా జరుగుతున్న పోటీల్లో అద్భుత ప్రదర్శనతో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధిస్తూ సత్తా చాటుతున్నారు. తాజాగా భారత పారా అథ్లెట్ సిమ్రాన్ మరో స్వర్ణ పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మహిళల టీ12 విభాగం 100 మీటర్ల పరుగులో విజేతగా నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన 200 మీటర్ల పరుగులోనూ స్వర్ణం సాధించిన సిమ్రాన్ వరుసగా రెండు పసిడి పతకాలు గెలుచుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరోవైపు పురుషుల టీ47 విభాగంలో దిలీప్ స్వర్ణం సాధించగా, 400 మీటర్ల పరుగులో అకీరా నందన్ బానోతు రజత పతకాన్ని అందుకున్నాడు. దీంతో భారత పతకాల సంఖ్య 54కు చేరుకుంది.

### రెండు స్వర్ణాలతో మెరిసిన సిమ్రాన్

పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ సిమ్రాన్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. మహిళల టీ12 విభాగంలో 100 మీటర్ల పరుగులో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి స్వర్ణ పతకాన్ని సాధించింది. అంతకుముందు మంగళవారం జరిగిన 200 మీటర్ల పరుగులోనూ పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఒకే క్రీడా పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి భారత పతకాల సంఖ్యను పెంచడంలో కీలక పాత్ర పోషించింది. రెండు విభిన్న దూరాల పరుగుల్లో విజేతగా నిలిచి తన ప్రతిభను చాటుకుంది.

### దిలీప్‌కు పసిడి.. భారత్‌కు మరో స్వర్ణం

పురుషుల టీ47 విభాగం 100 మీటర్ల స్ప్రింట్ పోటీలో భారత అథ్లెట్ దిలీప్ సత్తా చాటాడు. వేగవంతమైన పరుగుతో ప్రత్యర్థులను అధిగమించి స్వర్ణ పతకాన్ని సాధించాడు. కీలకమైన స్ప్రింట్ విభాగంలో దిలీప్ విజయం భారత పతకాల ఖాతాలో మరో పసిడిని చేర్చింది. పురుషుల అథ్లెటిక్స్ విభాగంలో భారత క్రీడాకారుల ప్రతిభకు ఈ విజయం మరో నిదర్శనంగా నిలిచింది.

### అకీరా నందన్ బానోతుకు రజతం

పురుషుల 400 మీటర్ల టీ35/38 విభాగంలో భారత అథ్లెట్ అకీరా నందన్ బానోతు రజత పతకాన్ని సాధించాడు. నిర్ణీత దూరాన్ని 51.25 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. స్వర్ణ పతకం చేజారినప్పటికీ రజతంతో భారత పతకాల సంఖ్యను మరింత పెంచాడు. భారత అథ్లెట్లు స్ప్రింట్‌తోపాటు ఇతర పరుగుల విభాగాల్లోనూ పతకాలు సాధిస్తూ తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.

### 54 పతకాలతో నాలుగో స్థానంలో భారత్

తాజా ఫలితాలతో భారత పతకాల సంఖ్య 54కు చేరుకుంది. ఇందులో 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో భారత్ పతకాల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు పతకాల సంఖ్య పెరగడానికి దోహదపడుతున్నాయి. ముఖ్యంగా సిమ్రాన్ రెండు స్వర్ణాలు సాధించడం, దిలీప్ పసిడి గెలవడం, అకీరా నందన్ బానోతు రజతం అందుకోవడం భారత బృందానికి కీలక విజయాలుగా నిలిచాయి.

### పతకాల వేటలో భారత అథ్లెట్ల సత్తా

జపాన్ వేదికగా జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు తమ పట్టుదల, ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. శారీరక సవాళ్లను అధిగమిస్తూ అంతర్జాతీయ వేదికపై దేశానికి పతకాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు సాధించిన 54 పతకాలతో భారత్ పతకాల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలవడం విశేషం. రానున్న పోటీల్లోనూ భారత అథ్లెట్లు ఇదే జోరు కొనసాగిస్తే పతకాల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

# జింబాబ్వేపై భారత్ ఘన విజయం

## 3-0తో సిరీస్ క్లీన్ స్వీప్!



రాయ్‌పూర్ వేదికగా జింబాబ్వే మహిళలతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 92 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 217 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 124 పరుగులకే పరిమితమైంది. భారత భారీ స్కోరు చేయడంలో సీనియర్ ప్లేయర్ హర్మన్‌ప్రీత్ కౌర్, విధ్వంసకర ఓపెనర్ షఫాలీ వర్మ కీలక పాత్ర పోషించారు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 41 బంతుల్లోనే 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 91 పరుగులు సాధించింది. మరోవైపు షఫాలీ వర్మ 37 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 69 పరుగులు చేసి రాణించింది.

### స్మృతి మంధాన రికార్డు బద్దలు కొట్టిన హర్మన్‌ప్రీత్:

ఈ మ్యాచ్‌లో అజేయంగా 91 పరుగులు చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త రికార్డు సృష్టించింది. భారత గడ్డపై మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత బ్యాటర్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఇంతకుముందు ఈ రికార్డు స్మృతి మంధాన పేరిట ఉండేది. 2025 డిసెంబర్ 28న తిరువనంతపురంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో మంధాన 48 బంతుల్లో 80 పరుగులు చేయగా, తాజాగా ఆ రికార్డును హర్మన్‌ప్రీత్ అధిగమించింది.

### బౌలింగ్‌లో రాణించిన నందని శర్మ:

భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన జింబాబ్వేకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెలిస్ న్ధ్లోవు ఖాతా తెరవకుండానే తొలి బంతికే ఔటైంది. షార్నే మేయర్స్ (60) పోరాడినప్పటికీ, భారత బౌలర్ల విజృంభణ ముందు నిలవలేకపోయారు. భారత బౌలర్లలో నందని శర్మ 4 ఓవర్లలో కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టింది. దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి చెరో వికెట్ తీశారు. జింబాబ్వే తరఫున కెలిస్ న్ధ్లోవు టీ20ల్లో అత్యధిక డకౌట్ల (9) రికార్డు నమోదు చేయగా, షార్నే మేయర్స్ ఒక ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు బాది రికార్డు సృష్టించింది. ఈ సిరీస్ విజయంతో భారత జట్టు నూతన జోరును ప్రదర్శించింది.

# ప్రపంచకప్ వేటకు యువ భారత్ సిద్ధం.. తొలి పోరు వెస్టిండీస్‌తో!

## మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్ 2027 షెడ్యూల్ విడుదల

మహిళా క్రికెట్‌లో యువ ప్రతిభను వెలికితీసే ఐసీసీ అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్ 2027 షెడ్యూల్, గ్రూపుల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి అధికారికంగా విడుదల చేసింది. ఈసారిన ఈ మెగా టోర్నీకి బంగ్లాదేశ్, నేపాల్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. జనవరి 21 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈ టోర్నీలో పాల్గొంటున్న 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు.

**గ్రూప్ ఏ: భారత్, ఐర్లాండ్, వెస్టిండీస్, నేపాల్**
**గ్రూప్ బీ: దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పాకిస్థాన్, సమోవా**
**గ్రూప్ సీ: ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, నైజీరియా, యూఏఈ**
**గ్రూప్ డీ: ఇంగ్లండ్, శ్రీలంక, అమెరికా, స్కాట్లాండ్**

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు గ్రూప్-ఏలో చోటు దక్కించుకుంది. ఆతిథ్య నేపాల్ జట్టు కూడా ఇదే గ్రూప్‌లో ఉండటం విశేషం. భారత్ తొలి మ్యాచ్ ఎవరితోనంటే? డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతున్న భారత అండర్-19 మహిళల జట్టు తన తొలి మ్యాచ్‌లో జనవరి 22న వెస్టిండీస్‌తో తలపడనుంది.







ఇక జనవరి 21న జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్, యూఏఈ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. టోర్నీ ఫార్మాట్ ఒ వేదికలు:బంగ్లాదేశ్ (చట్టోగ్రామ్, సిల్హెట్), నేపాల్ (ఖాట్మండు) దేశాల్లోని నాలుగు ప్రధాన స్టేడియాలలో ఈ టోర్నీ మ్యాచ్‌లు జరగనున్నాయి. జనవరి 26 వరకు గ్రూప్ దశ మ్యాచ్‌లు ముగుస్తాయి. ఆ తర్వాత సూపర్ సిక్స్ దశ, ఫిబ్రవరి 4న సెమీఫైనల్స్ నిర్వహించనున్నారు. టోర్నీలో అసలు సిసలైన ఫైనల్ మ్యాచ్ ఫిబ్రవరి 6న జరగనుండగా, వర్షం లాంటి అవాంతరాలు ఎదురైతే మ్యాచ్ నిర్వహణ కోసం ఫిబ్రవరి 7ను రిజర్వ్ డేగా కేటాయించారు.

## మూడో షెడ్యూల్‌కు కార్తీ-కళ్యాణ్ సినిమా



కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటించిన "సర్దార్-2" ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ నిరాశ మిగిల్చింది. అదే సమయంలో ఆయన అన్నయ్య సూర్య మళ్లీ ఫామ్‌లోకి రావడమే కాకుండా, తెలుగు దర్శకులతో కలిసి సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. ఇప్పుడు అదేబాటలో కార్తీ కూడా ఒక తెలుగు దర్శకుడితో కొత్త ప్రాజెక్టు ప్రారంభించారు. "మ్యాడ్" సిరీస్‌తో వరుస విజయాలు అందుకున్న యువ దర్శకుడు కళ్యాణ్ శంకర్ ఈ చిత్రానికి దర్శకుడు. ఇటీవలే అధికారికంగా ప్రకటించిన ఈ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి ఇప్పుడు ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ఎలాంటి హడావుడి, ప్రచారం లేకుండానే చిత్ర యూనిట్ షూటింగ్‌ను వేగంగా పూర్తి చేస్తోందని సమాచారం. ఇప్పటికే రెండు షెడ్యూల్స్‌ను విజయవంతంగా ముగించిన దర్శకుడు, ఇప్పుడు మూడో షెడ్యూల్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. కళ్యాణ్ శంకర్ మార్క్ వినోదం, కార్తీ నటన కలిస్తే ప్రేక్షకులకు మంచి ఎంటర్‌టైనర్ ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. "సర్దార్ 2" నిరాశ తర్వాత కార్తీకి ఈ సినిమా ఒక సరైన కమ్‌బ్యాక్ అవుతుందేమో చూడాలి. ప్రస్తుతం షూటింగ్ వేగంగా సాగుతుండటంతో, త్వరలోనే సినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్‌వంటి అప్‌డేట్స్ వచ్చే అవకాశముంది. ఈ చిత్రంపై తెలుగు, తమిళ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

## కేరళ సీఎంను మెప్పించిన మమితా బైజు సినిమా



దక్షిణాది సినిమా రంగంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ హీరోయిన్ మమితా బైజు. నేటితరం యువతను తనవైపు తిప్పుకున్న ఈ నటి నుంచి ఇటీవల వచ్చిన సంచలన హిట్ "బెత్లెహెం కుడుంబా యూనిట్". మలయాళ నటుడు నివిన్ పౌలి హీరోగా, "ప్రేమలు" ఫేమ్ గిరీష్ ఎడి దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ కామెడీ, అక్కడ రికార్డులు తిరగరాసి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఇటీవలే ఓటీటీలోకి వచ్చిన ఈ సినిమాకు, ఇక్కడా ప్రేక్షకులనుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. తాజాగా ఈ చిత్రం హవా ఏకంగా కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీషన్ వరకు చేరింది. సినిమా చూసిన ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. చాలాకాలం తర్వాత ఒక మంచి సినిమా చూశానని సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాదు, సినిమా అప్పుడే అయిపోయిందా అనిపించేంత బాగా ఆకట్టుకుందని చెబుతూ, చిత్ర యూనిట్ మొత్తానికి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన షేర్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో ఒక బుక్ షెల్ఫ్‌లో పుస్తకాలు ఉండగా, వాటి మధ్య నివిన్, మమితా బైజు పేర్లతో పాటు సినిమా టైటిల్‌తో ఉన్న పుస్తకాన్ని కూడా పెట్టి, ఎంతో వినూత్నంగా పోస్ట్ చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రినే ఇంతగా మెప్పించిందంటే, ఈ సినిమా కంటెంట్ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చని నెటిజన్లు అంటున్నారు. ఓటీటీలో కూడా ఈ చిత్రం అదే జోరు కొనసాగిస్తోంది. మమితా బైజు కెరీర్‌లో ఇది మరో మైలురాయిగా నిలిచిందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

## రెహమాన్ ట్యూన్‌కు దేవిశ్రీ గొంతు

పాన్ ఇండియా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో "రామాయణ" ఒకటి. దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ ఎపిక్ సినిమాలో రణబీర్ కపూర్, సాయిపల్లవి, యష్ వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. బిగ్ స్క్రీన్‌పై ప్రేక్షకులకు గొప్ప విజువల్ ట్రీట్ ఇవ్వనున్న ఈ చిత్రం నుంచి తాజాగా మేకర్స్ రెండో పాట విడుదల చేశారు. ఈసారి రావణాసురుడి పాత్రపై ఈ పాటను రూపొందించారు. "రావణ తాండవం" పేరుతో పాన్ ఇండియా భాషల్లో విడుదలైన ఈ పాటను సంగీత మాంత్రికుడు ఏఆర్ రెహమాన్ అద్భుతంగా స్వరపరిచారు. తెలుగు వెర్షన్‌ను టాలీవుడ్ టాప్ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌తో పాడించడం విశేషం. పాట విడుదలైన తర్వాత అన్ని భాషల వెర్షన్లతో పోలిస్తే, తెలుగులోనే మరింత ఇంటెన్సిటీతో వినిపిస్తోందని శ్రోతలు అంటున్నారు. దేవిశ్రీ తనదైన గొంతుతో ఈ పాటను ఆ స్థాయిలో పాడటం




ప్రధాన హైలైట్‌గా నిలిచింది.

ఈ పాటతో రెహమాన్ మరోసారి సిక్సర్ కొట్టారని చెప్పవచ్చు. ప్రస్తుతం విడుదల చేసిన పాట నిడివి తక్కువగానే ఉన్నప్పటికీ, సినిమాలో పూర్తి నిడివితో ఉండే అవకాశం ఉంది. రావణుడి పాత్రలో యష్ లుక్, ఆయన పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఈ పాటకు అదనపు బలాన్ని ఇచ్చాయి. ఇప్పటికే విడుదలైన అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ ఎపిక్ చిత్రం నవంబర్ 5న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

హాట్ స్టార్!



మిర్నా మీనన్

## 'ది ప్రాంప్ట్ వార్ -రైజ్ ఆఫ్ మహావీర్': పురాణం, ఏఐ కలయికతో కొత్త సినిమా

భారతీయ పురాణాలు, అంతుచిక్కని రహస్యాలు, ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీ కలగలిపిన సరికొత్త సినిమాటిక్ ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు "ఆర్వీహా క్రియేషన్స్" సిద్ధమవుతోంది. ఈ సంస్థ తన తొలి చిత్రంగా "ది ప్రాంప్ట్ వార్ -రైజ్ ఆఫ్ మహావీర్" టైటిల్‌ను దసరా పండుగ సందర్భంగా అధికారికంగా ప్రకటించింది. నరేష్ గౌడ్ నిర్మాతగా, నూతన దర్శకుడు ప్రసన్న కొత్వాల దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది.

ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కథా ప్రపంచంతో తెరకెక్కుతుండటం టాలీవుడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పురాణ గాథలను ఆధునిక సాంకేతికతతో మేళవించి, ప్రేక్షకులకు విజువల్ వండర్ అందించాలన్నదే చిత్ర యూనిట్ లక్ష్యం. "రైజ్ ఆఫ్ మహావీర్" అనే ఉపశీర్షిక కథలోని కీలక పాత్రపై, దాని వెనుక దాగి ఉన్న రహస్యాలపై ఉత్కంఠను పెంచుతోంది. ఈ చిత్రంతో జి.సి.శేఖర్ సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ, వినూత్న కథాంశంతో ముందుకు రావడం విశేషం. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో, 3డీ వెర్షన్‌లో సినిమా రూపొందుతోంది. 2027 వేసవిలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. పురాణం, సైన్స్ ఫిక్షన్ కలయికగా వస్తున్న ఈ ప్రయోగాత్మక చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే నటీనటుల వివరాలు, ఇతర అప్‌డేట్స్ వెల్లడించే అవకాశం ఉంది.






## నయనతార 'మహాశక్తి' తెలుగు ట్రైలర్ రిలీజ్

లేడీ సూపర్‌స్టార్ నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న భారీ చిత్రం నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు "మహాశక్తి" టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని, చిత్రానికి సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై డా. ఇషారి కె. గణేష్ ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. హిప్ హాప్ తమిళ సంగీతం అందిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న చిత్రంపై మొదటి నుంచే మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో నయనతార అత్యంత శక్తివంతమైన, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను కట్టిపడేశారు.

ఆమె లుక్, ఇంటెన్స్ ప్రెజెన్స్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అంతేకాదు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, హిప్ హాప్ తమిళా అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. సుందర్ సి ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు నయనతార వంటి స్టార్ హీరోయిన్‌తో ఒక భారీ ఫాంటసీ తరహా ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుండటంతో, ఈ సినిమా ఎలా ఉంటుందోనని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్‌కు వస్తున్న స్పందన చూస్తే, సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని అందుకునే అవకాశం ఉందని అనిపిస్తోంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.